సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
మంగళవారం । 1 । ఆగస్టు । 2023





## ప్రతి వాహనానికి థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ అవసరం

ప్రతి వాహనానికి తప్పనిసరిగా థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ఉండాలని జిల్లా ఉప రవాణా కమిషనర్ మీరా ప్రసాద్ పేర్కొన్నారు. -8లో



## రాణించిన బ్యాట్స్‌మన్

కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల అండర్-19 మల్టీడేస్ జోన్ మ్యాచ్‌ల్లో నార్త్‌జోన్ జట్టు బ్యాట్స్‌మెన్ రాణించారు. -8లో

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.9/27.5

జిల్లాలో సోమవారం 27.5 - 34.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### మహిళలకు ఉచిత శిక్షణ

**కడప వైఎస్ఆర్ సర్కిల్:** కడపలోని సంజీవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, బ్లౌజ్ డిజైనింగ్, మగ్గం వర్క్, జ్యూట్ బ్యా గుల తయారీ వంటి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇ స్తామన్నారు.ఆసక్తి గలవారు ఆగస్టు 5లోగా ద రఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9396161936 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

### నేడు వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం సమావేశం

**ప్రొద్దుటూరు:** డాక్టర్ వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం ప్రత్యేక సమావేశాన్ని ఆగస్టు 1న మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక మున్సిపల్ సభా భవనంలో నిర్వహించనున్నట్లు ఫోరం రాయలసీమ విభాగం కన్వీనర్ కె.చిన్నపరెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. 'సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం' అనే అంశంపై సమావేశంలో మేధావులు ప్రసంగిస్తారని వివరించారు.

### 4న జాబ్ మేళా

**కమలాపురం:** స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 4వ తేదీన ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శేషా చలపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు 15 ప్రముఖ కంపెనీలు వస్తున్నాయన్నారు. వివరాలకు 9912115622, 9063623706 నంబర్లలో సంప్రదించాలన్నారు.

### ఇన్‌స్పైర్ మనాక్‌లో పాల్గొనాలి

**కడప ఎడ్యుకేషన్:** ఇన్‌స్పైర్ మనాక్ ప్రదర్శనలో జిల్లాను ముందంజలో ఉంచేందుకు కృషి చేయాలని డీఈఓ రాఘవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులకు వెబెక్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని యాజమాన్యా పాఠశాలల విద్యార్థులు ఇన్‌స్పైర్ మనాక్ కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలన్నారు. ఈ సంవత్సరం అన్ని పాఠశాలల నుంచి 4 వేలకు పైగా నామినేషన్లు రావాలన్నారు. ఇందుకు సంబంధించి ఆగస్టు 31వ తేదీ వరకు గడువు ఉందన్నారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరెడ్డిని 944103 5830 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

### చెక్క భజన ఏసన్న మృతి



**కడప కల్చరల్:** జిల్లాలో చెక్క భజన కళాకారుడిగా విశేషమైన గుర్తింపు పొందిన జానపద కళాకారుడు డి.ఏసన్న (74) ఆదివారం రాత్రి మృతి చెందారు. కొద్ది కాలంగా అస్వస్థతతో ఉన్న ఆయన పరిస్థితి విషమించడంతో మరణించారు. సీనియర్ చెక్క భజన కళాకారులు రామన్న, లక్ష్మన్నల శిష్యుడైన ఏసన్న వారి వద్ద విద్యను అభ్యసించారు. చెక్క భజన రంగంలో నైపుణ్యం గల కళాకారునిగా రాష్ట్రమంతటా పేరు సంపాదించారు. ఢిల్లీలో ఆంధ్రరాష్ట్ర వేడుకల్లో ప్రదర్శన ఇవ్వడంతోపాటు రాష్ట్రంలో ఎన్టీఆర్ పురస్కారాన్ని పొందారు.ఏసన్నకు వందలాది మంది శిష్యులు ఉన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**కడప స్పోర్ట్స్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో 2023 సంవత్సరానికి సంబంధించి 'వైఎస్ఆర్ జీవితకాల సాఫల్య పురస్కారాలు, వైఎస్ఆర్ అచీవ్‌మెంట్ అవార్డుల కోసం అర్హులైన యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ తెలిపారు. అభ్యర్థులు వ్యక్తిగతంగా కళలు, సాంఘిక కార్యక్రమాలు, ప్రజా వ్యవహారాలు, సైన్స్, ఇంజినీరింగ్, వాణిజ్యం, పరిశ్రమలు, ఔషధం, సాహిత్యం, విద్య, పౌరసేవ, క్రీడలు ఇతర అంశాల్లో జాతీయ, అంతర్జాతీయస్థాయిలో విశేష ప్రతిభ కనబరిచిన వారు ఈ పురస్కారాలకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 8లోగా కడప కలెక్టరేట్‌లోని డి బ్లాక్‌లో ఉన్న స్టెప్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు 08562-241617 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### బాధ్యతల స్వీకరణ

**కడప కల్చరల్:** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రత్యేక అధికారిగా జి.శివశంకర్‌రెడ్డి సోమవారం కడప లోని సంస్థ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అసిస్టెంట్ జీఎంగా పదవీ విరమణ పొందిన ఆయన తన సర్వీసులో పలుమార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ సేవా కార్యక్రమాలను జిల్లాలో మరింత విస్తరించేందుకు కృషి చేస్తామన్నారు. అందరూ సామాజిక బాధ్యతగా భావించి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన కడపలోని డీసీసీ బ్యాంకులో నాబార్డు సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. మొత్తం 22 మంది రక్తదానం చేశారు.కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు సీఈఓ రాజేంద్రకుమార్, నాబార్డు డీడీఎం విజయ విహారి, ఎన్జీఓ ఓబుల దాసు, రత్నం, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# టమాట.. ఊరట



బహిరంగ మార్కెట్లో టమాటా ధరలు వినియోగదారున్ని బెంబేలెత్తిస్తున్నప్పటికీ... రాష్ట్రంలో ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. టమాటా ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో మార్కెటింగ్ శాఖ అధికారులను అప్రమత్తం చేసి మదనపల్లె, గుర్రంకొండ మార్కెట్లలో బహిరంగ వేలంలో రైతుల నుంచి టమాటాలను కొనుగోలు చేసి రైతు బజార్లకు తరలిస్తోంది. కేజీ టమాట ధర దాదాపు రూ.150 ఉండగా శనివారం నుంచి రూ.190 వరకు పలుకుతోంది. అయితే ప్రభుత్వం రైతు బజార్లో మాత్రం రాయితీ ధరపై కిలో రూ. 50కే అందజేస్తోంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- వినియోగదారుడిపై భారం పడకుండా ప్రభుత్వం చర్యలు
- రాయితీపై కిలో రూ.50తో అందజేత
- 21 రైతు బజార్లలో నెల రోజులుగా సాగుతున్న విక్రయాలు
- ఆంధ్రా అంతటా..అన్నమయ్య టమాట



రాయచోటిలోని రైతు బజార్లో రూ.50లతో అందిస్తున్న టమాటాలను తీసుకెళ్లేందుకు క్యూలైన్లలో ఉన్న ప్రజలు

**రాయచోటి:** రెండు నెలలుగా టమాట ధర తగ్గేదేలా అంటోంది. దీంతో సామాన్య ప్రజలు వీటి వైపు చూసేందుకు కూడా భయపడుతున్నారు. మరి కొంత మంది మాత్రం కేజీ తీసుకునే దగ్గర పావుకేజీ తీసుకుని వెళ్తున్నారు. ఈ తరుణంలో ఏపీ సర్కార్ మార్కెట్లలో సబ్సిడీ రూపంలో టమాటాలు అందిస్తోంది. దీంతో తెల్లవారుజాము నుంచే రైతు బజార్ల వద్ద క్యూ కడుతున్నారు. ఆధార్ కార్డు తీసుకొస్తే ఒక్కొక్కరికి కిలో మాత్రమే రాయితీపై ఇస్తున్నారు.

**రూ.324 కోట్లతో 3,04,460 కిలోల కొనుగోలు**

మార్కెట్లో పెరిగిన ధరల నుంచి ప్రజలకు ఉపశమనం లభించే విధంగా ప్రభుత్వం రాయితీతో రూ.50లకు అందజేస్తోంది. గత నెల నుంచి ఇప్పటి వరకు రూ.3,23,26,734 కోట్లతో 3,04,460 కిలోల టమాటాలను కొనుగోలు చేసింది. వీటిని విశాఖపట్నం, విజయవాడ, కర్నూల్, కడప, తిరుపతి, గుంటూరు, కాకినాడ, ప్రకాశం, నెల్లూరు, చిలకలూరిపేట, రాయచోటి లాంటి రైతు బజార్లలో ఉన్న 21 ప్రాంతాల్లో ప్రజలకు కిలో రూ.50లతో విక్రయించారు. ప్రభుత్వం అన్నమయ్య జిల్లా మదనపల్లి, గుర్రంకొండ మార్కెట్ల నుంచి రాష్ట్రంలోని నలుమూలలకు ఖరీదైన టమాటాలను తరలించి ప్రజలకు అందిస్తోంది.

**అదనపు భారాన్ని సైతం భరిస్తూ..**

రైతుల నుంచి కిలో రూ.96 నుంచి రూ.190 వరకు కొనుగోలు చేసి ప్రజలకు మాత్రం ప్రభుత్వం రూ.50లకే విక్రయిస్తుంది. దీనివల్ల వంద రూపాయల నుంచి రూ.140 వరకు కొనుగోలు భారం భరించాల్సి వస్తోంది. ఈ భారంతో పాటు కొనుగోలు చేసిన కాయలను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న రైతుబజార్లకు తరలించేందుకు రవాణా ఖర్చులను కూడా ప్రభుత్వమే భరిస్తోంది. తొలుత కిలో రూ.95 పలికిన టమాటా నేడు రైతుల వద్దనే రూ.190 పలుకుతోంది. ఇప్పటికే రైతులకు అందజేసే ధర.. రైతు బజార్లలో రూ.50తో అందజేస్తున్న ధరలు పోనూ ఒక కోటి 52 లక్షల 23 వేల రూపాయలు ప్రభుత్వం భరించింది. ఆయా ప్రాంతాలకు వాహనాల ద్వారా తరలించిన ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుంది. దీంతో అదనంగా మరో పాతిక కోటి లక్షలపైన ఖర్చులు వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

### ధరలతో సంబంధం లేకుండా టామాటాలు అందిస్తున్నాం

ధరలతో సంబంధం లేకుండా టమాటాలను కొనుగోలు చేసి ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు బజార్లకు తరలిస్తున్నాం. గత నెల ప్రారంభంలో కిలో టమాటాలను రూ.69.50పై. కొనుగోలు చేశాం. రాను రాను ధరలు తగ్గకపోగా దేశవ్యాప్తంగా నెలకొన్న కొరతతో ప్రస్తుతం మదనపల్లి మార్కెట్లో కిలో రూ.200కు దగ్గరైంది. నెలన్నర రోజులుగా ప్రభుత్వ ఆదేశానుసారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతు బజార్లకు తరలించి సామాన్య, పేద వర్గాల ప్రజలకు కుటుంబానికి కిలో వంతున అందజేస్తున్నాం.
- త్యాగరాజు, జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి

### రైతులు, సామాన్యుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కష్టించి పండించిన పంటకు మార్కెట్లో లభిస్తున్న ధరలను రైతులకు చెల్లించి పేద, సామాన్య ప్రజలకు అవసరమైన టమాటాలను రూ.50కి అందించాలని జగనన్న ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్ర ప్రజల కోసం ఎంత ఖర్చుకైనా ముఖ్యమంత్రి వెనకాడని మరో మారు రుజువైంది. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం అందించని విధంగా రైతుబజార్లలో టమాటాలను నిల్వ ఉంచి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రజలకు అందిస్తోంది.
- పంజం సుకుమార్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్

### ప్రభుత్వ నిర్ణయం సాహసోపేతం



టమాటా అవసరానికి తగ్గ దిగుబడి లేక ధరలు అమాంతంగా పెరిగిపోయి సామాన్య ప్రజలు కొనలేని పరిస్థితిలో ఉన్న సమయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సాహసోపేతమైనది. కిలో రూ.190లకు చేరినా ప్రజలకు మాత్రం రూ.50లకే అందిస్తోంది. రాయచోటిలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, అధికారుల సహకారంతో ఎక్కువ టమాటాలను తెచ్చి ప్రజలకు అందిస్తున్నాం.దీంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- వండాడి వెంకటేశ్వర్లు, మార్కెట్‌యార్డ్ కమిటీ చైర్మన్, రాయచోటి

## అమ్మపాలు అమృతం

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు



తల్లిపాలపై బాలింతలకు అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు

**కడప కోటిరెడ్డిసర్కిల్:** శిశువు ఆయుష్షు, ఆరోగ్యం పెంచడంలో తల్లిపాలు కీలకపాత్ర పోషిస్తాయి. అమ్మపాలు అమృతంతో సమానం. ఆధునిక పోకడలతో కొందరు తల్లులు వారి బిడ్డకు తల్లిపాలను దూరం చేస్తున్నారు. దీంతో శిశు మరణాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిఏడాది ఆగస్టు 1 నుంచి 7వ తేదీవరకు మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తోంది.ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత, ముర్రుపాలతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. సభలు, సదస్సులు నిర్వహించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తారు. పుట్టిన శిశువుకు గంటలోపే తల్లిపాలు తప్పనిసరిగా తాపిస్తే రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. కామెర్లు, టైఫాయిడ్, మలేరియా తదితర వ్యాధులను నిర్మూలించే ఔషధ గుణాలు తల్లిపాలలో ఉన్నాయి. బిడ్డ బరువు పెరిగేందుకు ఇవి దోహదపడతాయి. శిశు మరణాలు తగ్గుతున్నట్లు అధ్యయనాల ద్వారా వెల్లడవుతోంది. ప్రస్తుతం అనేక మంది మహిళలు రొమ్ము క్యాన్సర్‌బారిన పడుతున్నారు. దీనికి ముఖ్య కారణం బిడ్డకు పాలివ్వకపోవడమే. శిశువుకు తొలి ఆరు నెలలు బిడ్డకు పాలివ్వడం ద్వారా తల్లికి రొమ్ము క్యాన్సర్ బారిన పడే అవకాశాలు చాలా వరకు తక్కువగా ఉంటాయి.

### అవగాహన కల్పిస్తున్నాం



అంగన్వాడీ కార్యకర్తలు గర్భిణులు, బాలింతకు తల్లిపాల ఆవశ్యకత గురించి వివరిస్తున్నారు. బిడ్డకు పుట్టిన వెంటనే ముర్రుపాలు ఇచ్చేలా అవగాహన కల్పిస్తున్నాం.
- సునంద, సీడీపీఓ, కడప

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

**కడప సెవెన్‌రోడ్స్:** కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ విజయరామరాజు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శక విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ పీడీలు ఆనంద్‌నాయక్, శ్రీలక్ష్మి, డ్వామా పీడీ యదుభూషణరెడ్డి పాల్గొన్నారు.

**సక్రమంగా ఓటర్ల జాబితా సవరణ**

ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో పురోగతిపై సమీక్షించారు. డివిజన్, నియోజకవర్గాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2024 జనవరి 5వ తేదీ ఓటర్ల తుది జాబితాను ప్రకటించాల్సి ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించిన విధి విధానాల మేరకు జిల్లాలో అన్ని కార్యక్రమాలు ప్రణాళిక బద్ధంగా పూర్తి చేయాలన్నారు. డూప్లికేట్ ఓటర్లు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, మరణించిన వారు, కొత్తగా వివాహమైన వేరే ప్రాంతాలకు వెళ్లిన వారు, పునరావృతమైన పేర్ల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఫారం-6, 7, 8 పెండెన్సీ, గ్రీవెన్స్‌ల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. కొత్తగాఓటు నమోదుకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

# ఫిర్యాదులపై స్పందించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

**కడప అర్బన్:** జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించాలిన జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 'స్పందన'ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలనీ, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలనీ పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్‌క్రైమ్‌కు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా ఆన్‌లైన్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్ క్రైమ్.జీఓవి.ఇన్ ద్వారా నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్)లో, టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

# చదువులపై మదింపు

- నేటి నుంచి ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు
- 1 నుంచి 8 తరగతులకు ఓఎంఆర్ బేస్డ్ విధానం
- 9,10 తరగతులకు ఫార్మేటివ్ విధానం
- జిల్లాలో పరీక్షలు రాయనున్న 3,13,696 మంది



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

**కడప ఎడ్యుకేషన్:** విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు విద్యాశాఖ ఏటా పరీక్షలను నిర్వహిస్తోంది. గుణాత్మక విద్యను అందించేందుకు ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షలను ప్రభుత్వం గత ఏడాది నుంచి ప్రయోగాత్మకంగా క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్(సీబీఏ) పేరుతో నిర్వహిస్తోంది. ఈ క్రమంలో 2023-24 విద్యా సంవత్సరంలో నాలుగు ఫార్మేటివ్, రెండు సమ్మేటివ్ పరీక్షల నిర్వహణకు జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు(డీసీఈబీ) ఏర్పాట్లు చేస్తోంది. గతేడాది మాదిరిగానే 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు సీబీఏ, 9,10వ తరగతి విద్యార్థులకు ఫార్మేటివ్ విధానంలో పరీక్షలను జరపనున్నారు. ఇందులో ప్రైవేటు పాఠశాలలకు 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రశ్నపత్రాలను డీసీఈబీ వారే అందజేస్తారు.పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పరీక్షలు జరుపనున్నారు. జూన్, జులై సిలబస్‌కు సంబంధించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల ముదింపునకు సీబీఏ, ఫార్మేటివ్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థుల్లో అభ్యసనా లోపాలను గుర్తించి ప్రత్యేక బోధన ద్వారా వారిని సాధారణ స్థాయికి తీసుకొచ్చేందుకు కృషి చేస్తారు.

ఆగష్టు 1 నుంచి 4వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఎయిడెడ్, ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్యాల్లో 1,46,554 మంది, ప్రైవేటు యాజమాన్యంలో 1,67,142 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 1 నుంచి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు సీబీఏ విధానంలో 9,10 తరగతులను చెందిన విద్యార్థులు ఫార్మెటివ్ విధానంలో పరీక్షలను రాయనున్నారు.

**బైలింగ్వల్ విధానంలో...**

1 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థికి బైలింగ్వల్(తెలుగు, ఆంగ్లం) విధానంలో పశ్నపత్రాలను ఇవ్వనున్నారు. ఇంగ్లిషు ప్రశ్నపత్రం అర్థకాకుంటే తెలుగులో చదువుకునేందుకు వీలుగా ఉంటుంది. ఇందుకోసమే బైలింగ్వల్ విధానంలో ప్రశ్నపత్రాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. ఇందులోని 10 ప్రశ్నలు అబ్జెక్టివ్, మరో ఐదు ప్రశ్నలు రాతపూర్వక విధానంలో ఇస్తారు. ఓఎంఆర్ పత్రాల్లో జవాబులు రాసి జిల్లాకు పంపాల్సి ఉంటుంది.

**ఈ ఏడాది టోఫెల్ పరిచయం...**

గ్లోబల్ పోటీని విద్యార్థుల తట్టుకునే విధంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో టోఫెల్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ ఏడాది నుంచి టెస్టు ఆఫ్ ఇంగ్లిషు యాజ్ ఏ ఫారిన్ లాంగ్వేజ్(టోఫెల్)ను విద్యార్థులకు పరిచయం చేసింది. ఆడియో అండ్ ప్రాక్టీస్ పేపర్లను 3వ నుంచి 9వ తరగతి వరకు అమలు చేశారు.

జిల్లాలో విద్యార్థుల వివరాలు...

| మేనేజ్‌మెంట్ | పాఠశాలలు | విద్యార్థులు |
|---|---|---|
| గవర్నమెంట్ | 2000 | 1,38,668 |
| ఎయిడెడ్ | 67 | 7886 |
| ప్రైవేటు | 775 | 1,67,142 |
| మొత్తం | 2842 | 3,13,696 |

### ప్రశ్నపత్రాలను భద్రపరుచుకోవాలి



పరీక్ష పత్రాలు, ఓఎంఆర్ సీట్లను అన్ని మండల కేంద్రాలకు చేరవేశాం. పశ్నపత్రాలను ప్రధానోపాధ్యాయులు జాగ్రత్తగా భద్రపరచుకోవాలి. ఏ పరీక్ష రోజు ఆ ప్రశ్నపత్రాన్ని ఎంఈఓ ఆధ్వర్యంలో తీసుకెళ్లాలి. పరీక్షలన్నీ ముగియగానే జవాబు పత్రాలను కడప డీసీఈబీకి పంపాలి. - శంకరయ్య, డీసీఈబీ కార్యదర్శి, కడప

### పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి



జిల్లాలో గత విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తున్న క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ విధానంపై ఉపాధ్యాయులకు పూర్తి అవగాహన ఉంది. పకడ్బందీగా పరీక్షలను నిర్వహించేందుకు సూచనలు, సలహాలను ఇచ్చాం. పరీక్షలన్నీ ముగియగానే సంబంధిత సమాధాన పత్రాలను కడప డీసీఈబీకి చేరవేయాలి. - రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

# భావితరాలకు బాసటగా గ్రామ సచివాలయాలు

- సువర్ణ పాలన అందిస్తున్న ఏకైక సీఎం జగన్
- ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

**పులివెందుల/రూరల్:** గ్రామ సచివాలయాలు భావి తరలకు బాసటగా నిలుస్తున్నాయని, సువర్ణ పాలన అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, 30 ఏళ్లు జగన్ సీఎంగా ఉంటే ఆంధ్రప్రదేశ్ నంబర్‌వన్‌గా ఉంటుందని ఏపీ ప్రెస్ అకాడమీ రాష్ట్ర చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం వైఎస్సార్ జిల్లా పులివెందులలోని ఎస్‌ఎంబీ కల్యాణ మండపంలో పులివెందుల నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 16వేల కోట్ల రూపాయలు నాడు - నేడు కింద ఖర్చు పెట్టి ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్‌కు దీటుగా తీర్చిదిద్దారన్నారు. టెన్త్, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివిన వారే ఎక్కువ శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు, ఎల్లో మీడియాతో కలిసి అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు.90శాతం హామీలు అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 2లక్షల కోట్ల రుణాలను ప్రజలకు అందించారన్నారు. అభివృద్ధి అంటే ఏమిటో చూడాలంటే కొప్పర్తి, విశాఖ, పులివెందుల తదితర ప్రాంతాలకు వెళ్లాలని చెప్పారు. కృష్ణా జలాలను పులివెందుల ప్రాంతానికి తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రిదే అన్నారు. రాబోయే ఎన్నికలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన విధంగా 175కు 175స్థానాలు, 25లోక్‌సభ స్థానాలు భారీ మెజారీటీతో గెలవడం జరుగుతుందన్నారు. గుంటూరు శాంతమూరిత, వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, రాము, సాంబశివారెడ్డి, బయపురెడ్డి, బిదినంచర్ల బ్రహ్మానందరెడ్డి, రఫి, రసూల్, తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధి అంటే వైఎస్..**

అభివృద్ధి అంటే వైఎస్.. వైఎస్ అంటే అభివృద్ధి అని కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు.టీడీపీ అధినేత, చంద్రబాబుకు పులివెందుల ప్రాంతంలో అడుగు పెట్టే అర్హత లేదన్నారు. సోమవారం ఆయన పులివెందులలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేసిన పలు ప్రాంతాలను మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌తో కలిసి పర్యటించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పులివెందులను ఎంతో అభివృద్ధి చేశారని.. ఆయన వారసునిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుమారు రూ.1700కోట్లతో ఈ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. చంద్రబాబు 14ఏళ్లల్లో తన నియోజకవర్గమైన కుప్పంను అభివృద్ధి చేసుకోలేకపోయారని.. ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి కుప్పాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. కుప్పంలో ఈసారి చంద్రబాబు ఓటమి పాలవ్వడం ఖాయమని జోస్యం చెప్పారు. తన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోలేని చంద్రబాబు పులివెందుల ప్రాంతం, రాయలసీమలో ప్రాజెక్టులను అభివృద్ధి చేశానని చెప్పుకోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా సీఎం వైఎస్ జగన్‌చేస్తున్న అభివృద్ధి పనులు చూసి సహకరించాలి తప్ప.. బురదజల్లే మాటలు మాట్లాడటం మంచి పద్ధతి కాదన్నారు.

**వైఎస్సార్‌కు ఘన నివాళులు**

**వేంపల్లె:** ప్రెస్ అకాడమీ రాష్ట్ర చైర్మన్ సోమవారం వేంపల్లె మండలంలోని ఇడుపులపాయను సందర్శించారు. వైఎస్సార్ సమాధి వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు.

## వివాహిత ఆత్మహత్య


మృతిచెందిన చెన్నమ్మ

బద్వేలు అర్బన్ : పట్టణంలోని చెన్నంపల్లెలో ఆదివారం రాత్రి ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భార్యభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థలతోనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే ప్రకాశం జిల్లా కొమరోలు మండలం కూరకున పల్లెకు చెందిన చెన్నయ్య, లక్ష్మిదేవిల కుమార్తె అయిన చెన్నమ్మ (26)ను 8 ఏళ్ల క్రితం పట్టణంలోని చెన్నంపల్లెకు చెందిన కె.చంద్రమోహన్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆదివారం రాత్రి మృతురాలి ఆడబిడ్డతో ఏర్పడిన చిన్నపాటి గొడవ కారణంగా చెన్నమ్మను భర్త మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంటిలోని ఓ గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొద్దిసేపటి తర్వాత గదిలోకి వచ్చి చూసేసరికి ఉరితాడుకు వేలాడుతూ కనిపించడంతో స్థానికులను పిలిచి ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి చెన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ సీఐ జి.వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు.

## హాస్టల్ విద్యార్థి మృతి


మృతి చెందిన చరణ్

వీరపునాయునిపల్లె : మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలోని బీసీ హాస్టల్‌లో 8వ తరగతి చదువుతున్న చరణ్(13) అనే విద్యార్థి సోమవారం ఆకస్మికంగా మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. పెండ్లిమర్రి మండలం మాచునూరు కొత్తపేటకు చెందిన చరణ్ గత ఏడాది నుంచి బీసీ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. ఆదివారం రాత్రి యథావిధిగా తోటి విద్యార్థులతో కలసి భోజనం చేసి పడుకున్నాడు. సోమవారం ఉదయం చరణ్ అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు కలసి స్థానిక వైద్యుని వద్ద చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరుకు తరలించాలని అక్కడి వైద్యుడు సూచించడంతో అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలో చరణ్ మృతి చెందినట్లు ఎస్ఐ లక్ష్మి నారాయణ తెలిపారు. కాగా పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో మూడు రోజుల జైలు

రాయచోటిటౌన్ : మద్యం తాగి వాహనం నడిపిన కేసులో రాయచోటి పట్టణానికి చెందిన షేక్ ముబారక్‌కు రాయచోటి ఏజేఎఫ్‌సీఎం మెజిస్ట్రేట్ డాక్టర్ ఎస్‌టీఎం కె.శారద మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. రాయచోటి ట్రాఫిక్ ఎస్ఐ మహమ్మద్ రఫీ వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో మద్యం తాగి బైకు నడుపుతుండగా తనిఖీ చేసి కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా ఈమేరకు తీర్పు చెప్పారు.

# హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

- రూ. 500 జరిమాన లేక మరో నెలపాటు జైలు శిక్ష
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో శిక్ష పడేందుకు కృషి చేసిన కడప టూటౌన్ పోలీసులు


శిక్ష పడిన షేక్ ఖాదర్‌వలీ (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2021 నవంబర్ 16వ తేదీన రాత్రి 9:45 గంటల సమయంలో పఠాన్ ఖాదర్‌వలీ ఖాన్‌ను దారుణంగా హత్య చేసిన కేసులో ముద్దాయి షేక్ ఖాదర్‌వలీకి కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఈ కేసుకు సంబంధించిన పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. హతుడు పఠాన్ ఖాదర్‌వలీ ఖాన్ భార్య పఠాన్ ఆరీఫాఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇంటి వద్ద పిల్లలు గొడవ పడుతున్నారని, షేక్ ఖాదర్‌వలీ ఇంటిపైకి గొడవకు వస్తున్నాడని ఆమె తన భర్త పఠాన్ ఖాదర్‌వలీ ఖాన్‌కు ఫోన్ చేసి చెప్పింది. భర్త వచ్చి, ఇంటి వద్ద తన భార్య, పిల్లలతో గొడవపడుతున్న ఖాదర్‌వలీని ప్రశ్నించాడు. ఈ క్రమంలోనే నిందితుడు షేక్ ఖాదర్ వలీ కోపంతో కత్తి తీసుకుని పఠాన్ ఖాదర్‌వలీ ఖాన్‌ను దారుణంగా పొడిచి చంపాడు. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ స్వీయ పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్ సెల్ ద్వారా జిల్లా కోర్టులోని నాలుగవ అదనపు జిల్లా కోర్టు, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా వేగంగా విచారణ జరిపేందుకు పోలీసులు కృషి చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రతాప్‌కుమార్ రెడ్డి ఈ కేసును బాధితుల తరపున వాదించి, నిందితుడు షేక్ ఖాదర్ వలీకి శిక్షపడేలా చూశారు. నిందితుడికి నాలుగవ అదనపు జిల్లా జడ్జి ఇంతియాజ్ అహ్మద్ యావజ్జీవ కారాగార శిక్షతో పాటు, రూ.500 జరిమాన లేక మరో నెల కారాగార శిక్షను విధించారు. ఈ తీర్పుపై స్పందించిన జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్‌లు కేసు నమోదు చేసిన సమయంలోని సీఐ ఎస్ఎం ఆలీ, ప్రస్తుత సీఐ సయ్యద్ హాసం, కోర్టు మానిటరింగ్ సెల్ అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం సాయంత్రం కడప డీఎస్పీ తమ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భవిష్యత్తులో నేరాలకు పాల్పడేందుకు కూడా భయపడే విధంగా తమ వంతు కేసుల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్

వేంపల్లె : స్థానిక కడప రోడ్డులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో మంటలు అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. కడప రోడ్డులోని సి.ఫకృద్దీన్ ఇంట్లో ఫ్రిడ్జ్ వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. ఆ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇంట్లోని వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. దీంతో పెద్ద ప్రమాదమే తప్పింది. అగ్నిమాపక సిబ్బంది వెంకటసుబ్బయ్య, పెద్దయ్య, భీమాంజనేయులు, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కోర్టు అభివృద్ధికి నిధులివ్వండి

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి డాక్టర్ నారాయణ భరత్ గుప్తకు లేఖ ఇస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణంలోని కోర్టు కాంప్లెక్స్ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సీఎంఓ అదనపు కార్యదర్శి రేవు ముత్యాలరాజుకు విన్నవించారు. తాడేపల్లెలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆయనను కలిశారు. ప్రస్తుతం కోర్టు కాంప్లెక్స్‌లోని రెండో బిల్డింగ్ అసంపూర్తిగా ఉందని, పూర్తి స్థాయిలో వినియోగంలోకి రావాలంటే రూ.5.67 కోట్లు నిధులు అవసరమని ఎమ్మెల్యే తెలిపారు. కోర్టు బిల్డింగ్‌లో తాగునీటి సరఫరా, అంతర్గత రహదారుల నిర్మాణం, ప్రహరీ గోడ, విద్యుత్ పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇటీవల సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కూడా సమస్యలను వివరించానన్నారు. ఎమ్మెల్యే విజ్ఞప్తికి స్పందించిన ముత్యాలరాజు వెంటనే నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**నియోజకవర్గానికి..**

ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి డాక్టర్ నారాయణ భరత్ గుప్తాను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కోరారు. అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ఆయనకు లేఖ ఇచ్చారు. చౌటపల్లె పంచాయతీలో జగనన్న హౌసింగ్ కాలనీలో పెండింగ్‌లో ఉన్న రోడ్లకు సంబంధించి రూ.1.7 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరారు. కొత్తపల్లె పంచాయతీలోని వివేకానందనగర్, ప్రకాశ్ నగర్ కాలనీలో రూ.5.20 కోట్లతో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించాల్సి ఉందని.. యుద్ధ ప్రాతిపదికన పనులు మంజూరు చేసి నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఇందుకు నారాయణ భరత్ గుప్తా సానుకూలంగా స్పందించారు.

# ప్రతి వాహనానికి థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ అవసరం


మాట్లాడుతున్న జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ ఈ. మీరా ప్రసాద్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రతి వాహనానికి థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని జిల్లా ఉప రవాణా కమిషనర్ మీరా ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం నగర శివార్లలోని ఊటుకూరులోని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో ఆటో యూనియన్, వాహన యజమానులకు వాహన బీమా గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రామాణికంగా మోటార్ వాహన బీమా రెండు రకాలని, ఒకటి థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ రెండు కాంప్రహెన్సు ఇన్సూరెన్స్ అని తెలిపారు. మోటారు వాహనాల చట్టం సెక్షన్ 146 ప్రకారం ప్రతి వాహనానికి తప్పనిసరిగా థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ఉండాలన్నారు. థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ఉండటం మూలంగా వాహనం ద్వారా ఎవరికైనా ప్రమాదం జరిగిన సమయంలో నష్టం కలిగినట్లయితే ఆ నష్టపరిహారాన్ని సంబంధిత ఇన్సూరెన్స్ కంపెనీ వారు చెల్లిస్తారన్నారు. ఇన్సూరెన్స్ లేని వాహనాలపై కేసులు నమోదు చేసి, మొదటిసారి రెండు వేల రూపాయలు, రెండోసారి నాలుగు వేల రూపాయలు జరిమానా విధిస్తామన్నారు. నకిలీ ఇన్సూరెన్సులతో మోసపోవద్దని వాహన యజమానులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నకిలీ బీమా పత్రాలు అప్లోడ్ చేసినట్లయితే దరఖాస్తులను రద్దు చేయడమే కాకుండా దరఖాస్తుదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహనాల తనిఖీ అధికారి విజయభాస్కర్, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు ప్రకాష్, దేవమ్మ, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారం కోసం సర్పంచుల ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట సర్పంచులు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర పిలుపులో భాగంగా చేపట్టిన ఈ ధర్నా కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 14, 15 ఆర్థిక సంఘం ఇచ్చిన రూ. 8660 కోట్ల నిధులను తక్షణమే సర్పంచుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ జిల్లా అధ్యక్షుడు కొత్తపు మునిరెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యల్లారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# హైవే బైపాస్ అలైన్‌మెంట్ మార్చేశారు!

- హైకోర్టును ఆశ్రయించిన బాధితుడు
- పనులు నిలుపుదల చేయాలని ఆదేశం

కురబలకోట : కురబలకోట మండలం అంగళ్లు మీదుగా వెళ్లే హైవే బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్‌ను అనధికారికంగా మార్చడం వల్ల అన్యాయంగా భూములు కోల్పోవాల్సి వస్తోందని మదనపల్లె పట్టణానికి చెందిన కనసాని అర్జున్ రెడ్డి రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. దీంతో తాత్కాలికంగా పనులు నిలుపుదల చేయాలని కోర్టు ఆదేశించింది. సోమవారం అతనితోపాటు బాధిత రైతులు మదనపల్లె ఆర్డీఓ మురళి, స్థానిక తహసీల్దార్ ఎం.భీమేశ్వరరావుకు కూడా న్యాయం చేయాలని స్పందనలో ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు..ములకలచెరువు నుంచి మదనపల్లె వరకు ఎన్‌హెచ్ 42 రోడ్డు విస్తరణ (ఫోర్‌లేన్) పనులు రూ. 480 కోట్లతో సాగుతున్నాయి. భూసేకరణకు 2021లో కేంద్ర రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ తొలి నోటిఫికేషన్ ఇచ్చింది. ఆ తర్వాత 2022లో మలి నోటిఫికేషన్ ఇచ్చారు. న్యూఢిల్లీ మోర్త్ వారు రోడ్డు మ్యాపుతో పాటు విధి విధానాలు రోడ్డు నిర్మాణం కోసం అధికారులు ప్రొసీడింగ్స్ ఇచ్చారు. వీటిలో అంగళ్లు గ్రామ కస్బా 1061, 1062, 1060, 1073 సర్వే నంబర్లలో ఒకటిన్నర ఎకరం పోతున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఆ తర్వాత అధికారులు ఎందుకో మాస్టర్ ప్లాన్, అలైన్‌మెంట్ మార్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంగళ్లులో భూముల ధరలు ఎక్కువ పలుకుతున్నాయి. దీంతో బడా రైతులు తమ భూముల మీదుగా వెళ్లే హైవే బైపాస్ రోడ్డు ప్లాన్ మార్చి వాళ్ల భూములను కాపాడుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముందు నిర్ణయించిన అలైన్‌మెంట్ ప్రకారమే బైపాస్ రోడ్డు వేయాలని మరోసారి సర్వే నిర్వహించాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై విచారణ జరుపుతామని ఆర్డీఓ తెలిపారు.

# సాహస వలంటీర్‌కు నగదు పురస్కారం


వలంటీర్ సురేష్‌ను పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు మండలం ఓ.కొత్తపల్లెలో శనివారం రాత్రి పీర్ల చావిడి వద్ద ఏర్పాటు చేసిన గుండంలో కల్లూరి బాషా అనే వ్యక్తి ప్రమాదవశాత్తు పడిపోగా వలంటీర్ చాపల సురేష్ తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కాపాడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు సోమవారం వలంటీర్ ఇంటికి వెళ్లి సన్మానించి నగదు పురస్కారం అందజేశారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ ప్రజలకు ఎంతో మేలు చేస్తోందనేందుకు ఈ సంఘటన నిదర్శనమన్నారు. కాగా పీర్లగుండంలో పడి తీవ్రగాయాలైన బాషాకు మెరుగైన వైద్యం అందించాలని రుయా ఆసుపత్రిలోని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, ప్రముఖ న్యాయవాది ఆర్‌సీ సురేష్ బాబు, ఎంపీటీసీ జనార్దన్‌రాజు, ప్రతాప్‌రెడ్డి, సుంకేసుల బాషా, తొండం రాజేంద్ర, ధనుంజయ, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉక్కుఫ్యాక్టరీ సెయిల్ ఆధ్వర్యంలో నిర్మించాలి

కలెక్టరేట్ వద్ద సీపీఎం ధర్నా


కలెక్టరేట్‌వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : కడప ఉక్కు ఫ్యాక్టరీని సెయిల్ ఆధ్వర్యంలో నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ కోరారు. సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఫస్ట్ క్వాలిటీ ఐరన్ ఓర్ పుష్కలంగా ఉందని చెప్పారు. ఈ విషయంపై సర్వే నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు వెళ్లాయన్నారు. దీని ఆధారంగానే 2007లో నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి బ్రాహ్మణి స్టీల్స్‌కు శంకుస్థాపన చేశారని తెలిపారు. 2018 డిసెంబరులో చంద్రబాబు ముఖ్యమంత్రి ఉన్నప్పుడు కంబాలదిన్నెలో, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో ఒకసారి, ఈ ఏడాది ఫిబ్రవరిలో మరోసారి శంకుస్థాపనలు చేశారని వివరించారు. కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని బీజేపీ బహిరంగ తీర్మాన ప్రకటన చేసిందన్నారు. అయితే పార్లమెంటులో జులై 25న హోం శాఖ సహాయమంత్రి కడప ఉక్కు లాభదాయకం కాదని చెప్పడం బీజేపీ రెండు నాల్కల ధోరణికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్రానికి బీజేపీ తీరని మోసం చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు శివకుమార్, బి.మనోహర్, ఐఎస్ సుబ్బమ్మ, శ్రీనివాసులురెడ్డి, దస్తగిరిరెడ్డి, ఎస్.పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రాణించిన బ్యాట్స్‌మన్


తలపడుతున్న నార్త్‌జోన్, సెంట్రల్ జోన్ జట్లు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల అండర్-19 మల్టీడేస్ జోన్ మ్యాచ్‌ల్లో నార్త్‌జోన్ జట్టు బ్యాట్స్‌మెన్ రాణించారు. సోమవారం నిర్వహించిన మ్యాచ్‌లో నార్త్‌జోన్, సెంట్రల్ జోన్ తలపడ్డాయి. టాస్ గెలిచిన నార్త్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలిరోజు ఆట ముగిసే సమయానికి 93 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి నార్త్‌జోన్ జట్టు 289 పరుగులు చేసింది. జట్టులోని కె.ఎ.ఎస్. ప్రసాద్ 79 పరుగులు చేయగా, యశ్వంత్ 67, పృథ్వీరాజ్ 59 పరుగులతో క్రీజులో ఉన్నారు. సెంట్రల్ జోన్ బౌలర్ గీత్ 3 వికెట్లు తీశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

## పాఠశాల గేటు తగిలి విద్యార్థినికి తలకు గాయాలు


ఆస్పత్రిలో విద్యార్థినిని పరామర్శిస్తున్న డీఈఓ రాఘవరెడ్డి

చింతకొమ్మదిన్నె : పాఠశాల గేటు తగిలి విద్యార్థిని తలకు గాయాలైన సంఘటన సోమవారం మండలంలోని బోడెద్దులపల్లె ఉర్దూ పాఠశాలలో చోటుచేసుకుంది. పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న విద్యార్థిని హయుం తలపై పాఠశాల ప్రధాన గేటు పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన ఉపాధ్యాయులు విద్యార్థినిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. డీఈఓ రాఘవరెడ్డి, ఎంఈఓ-2 రమాదేవి ఆస్పత్రిలో విద్యార్థినిని పరామర్శించారు.

## గంజాయి కేసులో ముగ్గురు అరెస్టు


గంజాయి కేసులో నిందితుల అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న చిన్నచౌక్ సీఐ శ్రీరామశ్రీనివాసులు

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉక్కాయపల్లి డంపింగ్ యార్డ్ సమీపంలో గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురిని సోమవారం అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీరామశ్రీనివాస్ తెలిపారు. నిందితులలో సురభి మహేష్, గండ్లూరు మునెయ్య, సోమల అనీష్‌లు ఉన్నారు. వారి వద్ద నుంచి 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన ఎస్ఐ రవికుమార్, సిబ్బందిని సీఐ అభినందించారు.

## మునగానపల్లెలో మాయమై బెంగళూరులో ప్రత్యక్షం

బి.కొత్తకోట : బాగా చదువుకోమని తండ్రి చెబితే పాఠశాల నుంచి ఇంటికి రాకుండా అదృశ్యమైన విద్యార్థి సోమవారం కర్ణాటకలోని బెంగళూరు గాంధీనగర్ పోలీసులకు చిక్కాడు. వివరాలు ఇలా.. పెద్దతిప్పసముద్రం మండలం సంపతికోటకు చెందిన విశ్వనాథరెడ్డి కుమారుడు రవితేజ (14) గ్రామానికి సమీపంలోని కర్ణాటకకు చెందిన మునగానపల్లె ప్రభుత్వ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్నాడు. జూలై 12న బాగా చదువుకోవాలని కొడుకుకు తండ్రి సూచించాడు. ఆరోజు హైస్కూల్‌కు వెళ్లిన రవితేజ ఇంటికి తిరిగి రాలేదు. సోమవారం బెంగళూరు గాంధీనగర్ పరిసరాల్లో సంచరిస్తున్న రవితేజను పోలీసులు గుర్తించారు. పోలీసుల విచారణలో తనది బి.కొత్తకోటగా చెప్పాడు. దీనితో స్థానిక ఎస్ఐను సంప్రదించిన గాంధీనగర్ పోలీసులు రవితేజ ఫొటో, వివరాలు పంపారు. ఈమేరకు సంపతికోటకు చెందిన విశ్వనాథరెడ్డి కుమారుడిగా గుర్తించి బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు.

# పెట్రోల్ బంకులో విజిలెన్స్ అధికారుల తనిఖీలు


మైదుకూరు పెట్రోల్ బంకులో తనిఖీ చేస్తున్న రీజనల్ విజిలెన్స్,ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మాసుం బాషా

కడప అర్బన్/ మైదుకూరు : మైదుకూరు పట్టణం నంద్యాల రోడ్డులో ఉండే సిరి ప్యూర్ ఫ్యూయల్స్‌ను రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి షేక్ మాసుంబాషా నేతృత్వంలో అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెట్రోల్ స్వచ్ఛత కోసం ఫిల్టర్ పేపర్ టెస్ట్ చేశారు. డెన్సిటీ టెస్ట్, పెట్రోల్ బంకులో అండర్ గ్రౌండ్ ట్యాంకులలో వాటర్ చెక్ టెస్ట్ చేశారు. 5 నాసిల్స్‌లలో ఏవైనా చిప్పులుగానీ, ఎక్స్‌ట్రా ఫిట్టింగ్స్ గానీ ఉన్నాయా అని పరిశీలించారు. పెట్రోల్ బంకు బాత్ రూమ్స్, డ్రింకింగ్ వాటర్, ఎయిర్‌మిషన్‌ను తనిఖీ చేశారు. రికార్డ్స్‌ను పరిశీలించారు. ఈ తనిఖీలలో ఇన్స్‌పెక్టర్ జి. ఈదురుబాషా, లీగల్ మెట్రాలజీ కడప ఇన్‌చార్జి రాయచోటి అధికారి నాగరాజు, అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ సి. తారకనాథరెడ్డి, సీఎస్‌డీటీ బద్వేల్ చంద్రశేఖర్, విజిలెన్స్ అధికారులు ఈ. బాలగంగాధర్‌రెడ్డి, ఏఓ కె.వి. కిషోర్, ఏఈఈ ఎస్. జనార్దన్‌రావు, హెడ్‌కానిస్టేబుల్ ఎం. కృష్ణానాయక్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# మహిళ బ్యాగులో బంగారు గొలుసు అపహరణ

బద్వేలు అర్బన్ : స్థానిక ఆర్టీసీ బస్టాండులో సోమవారం ఓ మహిళ బ్యాగులో బంగారు గొలుసు అపహరణకు గురైంది. వివరాల్లోకి వెళితే పోరుమామిళ్లకు చెందిన రహమత్‌బీ తన కుటుంబ సభ్యులతో కలిసి నెల్లూరు జిల్లాలో జరుగుతున్న రొట్టెల పండుగకు బయలుదేరింది. నెల్లూరులో ఉంటున్న ఆమె కుమార్తె తన బంగారు గొలుసు తీసుకు రావాలని చెప్పడంతో రహమత్‌బీ తన బ్యాగులో బంగారు గొలుసు ఉంచుకుని పోరుమామిళ్ల నుంచి బద్వేలుకు వచ్చింది. బద్వేలులో నెల్లూరు బస్సు ఎక్కిన తర్వాత బ్యాగులో గొలుసు చూసుకోగా కనిపించలేదు.

వెంటనే బస్టాండులోని సిబ్బందికి విషయం తెలపడంతో వారు పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు కొందరు అనుమానిత మహిళలను స్టేషన్‌కు తరలించి విచారించగా గొలుసు లభ్యం కాలేదు. దీనిపై పూర్తిస్థాయిలో విచారిస్తున్నారు.

# మనస్పర్థలతో ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : మహిళా గ్రామ వలంటీర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. కోటవారిపల్లె పంచాయతీ పాకాలవారిపల్లెకు చెందిన మణికంఠ భార్య భవిత(24) పెంచుపాడు పంచాయతీ కొండమీదపల్లె గ్రామ వలంటీర్‌గా పనిచేస్తోంది. భర్త అయిదేళ్ల క్రితం మృతి చెందాడు. సోమవారం కుటుంబ సమస్యల కారణంగా ఇంట్లోనే పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**తల్లిదండ్రులు మందలించారని..**

ములకలచెరువు మండలం చీకటిమానుపల్లెకు చెందిన వెంకటేష్ కుమారుడు విజయ్(16) స్థానికంగా పదో తరగతి చదువుతున్నాడు. ఇటీవల సక్రమంగా పాఠశాలకు వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. తనకు చదువుకోవడం ఇష్టం లేదని, తల్లిదండ్రుల ఎదుటే చెప్పడంతో వారు మరింత కోప్పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన విజయ్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అవుట్‌పోస్ట్ సిబ్బంది సమాచారాన్ని ములకలచెరువు పోలీసులకు అందించారు.